శతాధిక వృద్ధురాలికి సన్మానం

సనత్‌నగర్ మోడల్ కాలనీకి చెందిన శతాధిక వృద్ధురాలు కల్లూరి విమలా దేవి (101)ని కాలననీకి చెందిన వయోవృద్ధుల సంఘం ఆదివారం ఘనంగా సన్మానించింది. ఐదు తరాలకు ప్రతినిధిగా ఉన్న కల్లూరి విమలా దేవిని సన్మానించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్టు ఖైతరాబాద్ జీహెచ్ఎంసీ ఆసరా కమిటీ కార్యదర్శి జేఎస్‌టీ సాయి పేర్కొన్నారు. ఐదుగురు కుమార్తెలు, 9 మంది మనుమలు, 6గురు మనువరాండ్లు, 25 మంది ముని మనువలు, ముని మనువరాండ్లతో విమలాదేవి కుటుంబం విరాజిల్లుతుండటం అభినందనీయమన్నారు. ఈ సన్మానంలో కాలనీ ప్రతినిధులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

– అమీర్‌పేట్, జనవరి 14

నగరంలో ఆదివారం పలు చోట్ల చిన్నా పెద్ద అంతా భోగి మంటలు వేసి భోగి పండుగ సందర్భంగా సంతోషంగా గడిపారు. ఒకవైపు రంగు రంగుల ముగ్గులు, మరోవైపు మంటలతో ఆనందంగా గడిపారు.

కిడ్స్ ఫ్యాషన్ షో

తెలంగాణ గుజరాతీల కోసం 'గుజరాతి ఏక్తా మహోత్సవం జెమ్-24' జనవరి 7 నుంచి ఏప్రిల్ 21 వరకు కొనసాగుతున్నది. ఇందులో భాగంగా 'జెమ్ - 24' గ్రాండ్ ఫైనల్ కోసం కిడ్స్ ఫ్యాషన్ షోను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో 200 మంది పిల్లలు ఆడిషన్‌లో భాగస్వామ్యం పంచుకున్నారు. ఫ్యాషన్ షో ప్రదర్శన సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి రోడ్ గుజరాతి స్కూల్‌లో జరిగింది. ఇవే కాకుండా తెలంగాణలోని గుజరాతీల అందరి కోసం ఒక భారీ ఈవెంట్ 'గుజరాతీ ఏక్తా మహోత్సవ్' నిర్వహించడం జరుగుతున్నది. ఇందులో క్రీడలు, సంస్కృతి, ప్రతిభ, అందాల పోటీలు, కిడ్స్ ఫ్యాషన్ షో, ఇంకా మరెన్నో ఆసక్తికరమైన ఈవెంట్లను ఈ గ్రాండ్ ఫినాలేలో నిర్వహిస్తున్నారు. పిల్లలు ఐదేండ్ల నుంచి పదేండ్లకు పైన ఉన్న పిల్లలు ఈ ఈవెంట్లలో భాగస్తులు అవుతున్నారు. పిల్లలు సంప్రదాయ, సమకాలీన దుస్తువులను ప్రదర్శిస్తూ ర్యాంప్‌పై సందడి చేశారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గుజరాత్ సమాజ్ ఏప్రిల్ వరకు నిర్వహిస్తున్నది. పెద్దలకు, మహిళలకు క్రికెట్, బ్యాడ్మింటన్, చెస్, మిస్ & మిసెస్ తెలంగాణ గుజరాతీ, నృత్యాలు, తదితరాలను 'గుజరాతి ఏక్తా మహోత్సవ్'లో చేపడుతున్నారు.

– సిటీ డెస్క్ సేకరణ

స్వామి సన్నిధిలో డీజీపీ..



యాదగిరిగుట్ట ఆలయంలో డీజీపీ రవి గుప్తా దంపతులకు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న ప్రధాన అర్చకుడు నల్లన్‌థీఘశ్ లక్ష్మీనర్సింహాచార్యులు

యాదగిరిగుట్ట, జనవరి 14: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి సేవలో డీజీపీ రవి గుప్తా దంపతులు ఆదివారం తరించారు. వారికి ప్రధాన అర్చకులు నల్లన్‌థీఘశ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు ఆలయ సంప్రదాయ స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనానంతరం ఆలయ ప్రధాన అర్చక బృందం వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ రామకృష్ణారావు స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ చిరంజీవి చౌదరి దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. అదే విధంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

నిరంతర విద్యుత్‌కు ప్రత్యేక చర్యలు

టీఎస్ఎస్‌సీపీడీసీఎల్ రంగారెడ్డి జోన్ సీజీఎం ఆనంద్

హశామాబాద్‌లోని యాకూత్‌పురా ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్‌తో మాట్లాడుతున్న టీఎస్ఎస్‌సిపిడిసిఎల్ రంగారెడ్డి జోన్ సిజిఎం ఆనంద్

మైలార్‌దేవపల్లి, డిసెంబర్ 14: ప్రభుత్వం నిరంతరం విద్యుత్ నాణ్యమైన విద్యుత్ అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని టీఎస్ఎస్‌సీపీడీసీఎల్ రంగారెడ్డి జోన్ సీజీఎం ఆనంద్ తెలిపారు. ఆదివారం సంస్థ సీఎంబీ ముషారఫ్ షారుఖ్‌కి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలను తెలుసుకోవడానికి సీజీఎం ఆనంద్, రాజేంద్రనగర్ విద్యుత్ డీఈ పి.రత్నాకర్‌రావు, ఏడీఈ ఈశ్వర్ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసులు కలిసి మైలార్‌దేవపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలోని హశామాబాద్‌లో ఉంటున్న యాకూత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ ఇంటికి వెళ్లి విద్యుత్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సీజీఎం ఆనంద్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న విద్యుత్ సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే వాటిని సత్వరమే పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలిస్తారన్నారు. ప్రజలు విద్యుత్ సంస్థ అధికారులకు సహకరించి బిల్లులు సకాలంలో చెల్లించాలని ఆయన కోరారు.

అమ్మంగి జంట కవితా సంపుటి ఆవిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు ఏనుగు నరసింహారెడ్డి, నందిని సిధారెడ్డి

రవీంద్రభారతి, జనవరి 14: తండ్రి కూతుళ్ల పుస్తకాలను ఒకేసారి ఆవిష్కరించడం ఇంత వరకు తాను చూడలేదని కవి రచయిత డా.నందిని సిధారెడ్డి అన్నారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక గ్రంథావిష్కరణ ఆదివారం జరిగింది. అమ్మంగి వేణుగోపాల్ ముఖచిత్రం కవితా సంపుటిని ప్రముఖ రచయిత డా.ఏనుగు నరసింహారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం దానిని సిధారెడ్డికి అంకితమిచ్చారు. అమ్మంగి కవిత రాసిన స్వామి ముందడుగు కవితా సంపుటిని డా.నందిని సిధారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నందిని సిధారెడ్డి మాట్లాడుతూ తండ్రి వారసత్వాన్ని కూతూరు కొనసాగించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి సభా అధ్యక్షుడిగా ఆచార్య చెన్నకేశవరెడ్డి, విశిష్ట అతిథిగా ప్రొఫెసర్లు లక్ష్మీనారాయణ, డా.తిరునగరి దేవకీదేవి, డా.జలంధర్ రెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అజ్మీర్ దర్గాలో చాదర్ సమర్పణ



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తరపున అజ్మీర్ దర్గాలో చాదర్‌ను సమర్పించిన మలక్‌పేట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆజం అలలీ, ఎంకే బద్రుద్దీన్, బాసిత్‌లు

అబిడ్స్, జనవరి 14: మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తరపున అజ్మీర్ షరీఫ్ దర్గాలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చాదర్‌ను సమర్పించారు. మలక్‌పేట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్, మాజీ హోం శాఖ మంత్రి మహమూద్ అలీ తనయుడు ఆజం అలీ, బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎంకే బద్రుద్దీన్, బాసిత్‌లు అజ్మీర్ దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటైనప్పటి నుంచి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అజ్మీర్ దర్గాలో ప్రతి సంవత్సరం జరిగే ఉర్సు ఉత్సవాలలో చాదర్‌ను సమర్పిస్తారు. రాష్ట్ర మాజీ హోం శాఖ మంత్రి మహమూద్ అలీ నేతృత్వంలో ప్రతి సంవత్సరం చాదర్‌ను సమర్పిస్తూ వస్తున్నారు. ఈ సంవత్సరం కూడా అదే తరహాలో కేసీఆర్ తరపున చాదర్‌ను సమర్పించి బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం రావాలని, కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థనలు చేసినట్లు ఎంకే బద్రుద్దీన్ తెలిపారు.

రెడీ టు సర్వ్‌కు రూ.2 లక్షల విరాళం

రెడీ టు సర్వ్ ఫౌండేషన్‌కు రూ.2లక్షల చెక్కును అందజేస్తున్న గేమ్ చేంజర్ చిత్ర యూనిట్

ఆర్కేపురం, జనవరి 14: 'గేమ్ చేంజర్' చిత్ర యూనిట్ ఆదివారం రెడీ టు సర్వ్ ఫౌండేషన్, ఆటేలి ఆటం ఫౌండేషన్‌కు రూ.2 లక్షల చెక్కును విరాళంగా అందజేసింది. ఈ సందర్భంగా రెడీ టు సర్వ్ ఫౌండేషన్ నిర్వాహకుడు పెద్ది శంకర్ మాట్లాడుతూ, విరాళం శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు నిర్మాతగా రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న గేమ్ చేంజర్ సినిమా షూటింగ్‌లో సినిమా ప్రొడక్షన్ కంట్రోలర్ వాసు అనాథ, వృద్ధులకు సహాయం చేయాలనే ఉద్దేశంతో రూ.2 లక్షలను అందజేశారని చెప్పారు. చిత్ర యూనిట్‌కు పెద్ది శంకర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు ప్రతాప్, అవినాశ్ కొల్ల, ప్రవీణ్, నరసింహారావు, జబ్బీర్, రషీద్, రవిశంకర్ పాల్గొన్నారు.

పార్కింగ్ పరేషాన్..!

- పార్కింగ్ సదుపాయం కోసం అన్వేషిస్తున్న అద్దె ఇంటి వాహనదారులు
- నెలకు రూ.15 వందల నుంచి 2వేలకు పైగా చార్జి
- అంతకు మించి ఇస్తామంటూ పోటీ వాతావరణం
- పార్కింగ్ సదుపాయాన్ని అద్దెకు ఇస్తూ క్యాష్ చేసుకుంటున్న ఇంటి ఓనర్లు
- నగరంలో ఇంటి గేట్లకు పార్కింగ్ బోర్డుల ఏర్పాటు
- కారున్నా.. పార్కింగ్ లేదని సతమతం
- సెకెండ్ హ్యాండ్ కార్లు తక్కువ ధరలో వస్తుండటంతో అధికంగా కార్ల కొనుగోళ్లు

సిటీబ్యూరో, జనవరి 14(నమస్తే తెలంగాణ): ఎంత ఖరీదైన కారు కొన్నా.. అది నిలిపేందుకు పార్కింగ్ లేకపోతే ఓనరుకు కంటి మీద కునుకు లేనట్టే. రోడ్డుపై వాహనం నిలిపితే ఏదైనా డ్యామేజీ అవుతుందనే భయం వెంటాడుతుంటుంది. రోడ్డుపై కూడా స్థలం లేకపోతే పక్క కాలనీయో..లేదా ఇంకో కాలనీకి చెందిన ఖాళీ స్థలం వెతుక్కోవాల్సి వస్తుంది. అలా కూడా ఎక్కువ రోజులు పార్కింగ్ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో కారు ఓనర్లకు.. పార్కింగ్ కష్టాలు తప్పడం లేదు. అలాంటి వారందరూ పార్కింగ్ స్థలం కోసం అన్వేషిస్తున్నారు. ఈ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని చాలా మంది అపార్ట్‌మెంట్ వాసులు ఖాళీగా ఉన్న పార్కింగ్ సదుపాయాన్ని విక్రయిస్తున్నారు. నెలకు రూ.12 వందల నుంచి 2000 వరకు చార్జి చేస్తున్నారు. పార్కింగ్ సదుపాయం కోసం కారు ఓనర్లు ఇంకొంత ఎక్కువైనా పర్లేదు కానీ, పార్కింగ్ మాత్రం తమకే ఇవ్వాలంటూ పోటీపడుతుండటం విశేషం. నగరంలో పార్కింగ్ కష్టాలు ఎక్కువగా ఉండటంతో ఇంటి ఓనర్లు 'పార్కింగ్ అవైలేబుల్' అనే బోర్డులను సైతం ఇంటి గేటు ముందు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కొత్తగా కారు కొనాలనుకునేవాళ్లు ముందుగా పార్కింగ్ స్థలం సమకూర్చుకోవడంపై దృష్టి సారించడం విశేషం.

స్టేటస్ సింబల్‌గా..!

కారు ఇప్పుడు ప్రతి ఒక్కరికి స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. అవసరమున్నా.. లేకున్నా.. కారు ఉండాల్సిందేనని చాలా మంది భావిస్తున్నారు. కొందరు తమ విధుల్లో భాగంగా కొనుగోలు చేస్తుంటే.. మరి కొందరు ఫ్యామిలీ ట్రిప్పుల కోసం వినియోగించుకోవాలని ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఇంకొందరు కారు ఉంటే చాలన్నట్టు గౌరవం కోసం కొనుగోలు చేస్తున్నారు. మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతి వర్గాలకు అత్యంత అవసరంగా మారింది. కార్ల విక్రయాలకు నగరం చిరునామాగా మారుతుంది. వ్యాపార, వాణిజ్య, సినీ, రాజకీయ దిగ్గజాలకు కేంద్రమైన నగరంలో ప్రతి ఏడాది కార్ల విక్రయాలు భారీగా పెరుగుతున్నాయి. కొత్త కారైతే.. కనీసం రూ.15 లక్షల నుంచి 9 కోట్లకు పైగా అమ్ముడుపోతుంటే.. పాత కార్లు ఇక అతి తక్కువ బడ్జెట్‌లో అందుబాటులో లభిస్తున్నాయి. గత ఏడాది కొత్త కార్లు గ్రేటర్‌లో సుమారు 5,798 కార్లు అమ్ముడుపోగా, సెకెండ్ హ్యాండ్ కార్ల అమ్మకాలు కూడా 70 శాతం పెరిగాయని నిర్వాహకులు చెబుతున్నారు. ఇలా రోజురోజుకు కార్ల కొనుగోళ్లు నగరంలో విరివిగా పెరుగుతున్నాయి. మార్కెట్లో కూడా సెకండ్ హ్యాండ్ కార్ల కొనుగోళ్లు జోరందుకుంటున్నాయి. వాటి సేల్స్ కోసం నగరంలో విరివిగా షోరూంలు కూడా వెలుస్తున్నాయి.



నగరంలో తగ్గుతున్న చలి..

జూబ్లీహిల్స్, జనవరి 14: గ్రేటర్‌లో చలి ప్రభావం తగ్గుతుంది. నగరంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు 33.2 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 18.7 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 40 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగి చలి తీవ్రత తగ్గనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఫీజు రియింబర్స్‌మెంట్ ఇవ్వాలి

రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విద్యార్థుల సమస్యలు విన్నవిస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, తదితరులు

కాచిగూడ, జనవరి 14: ఇంజనీరింగ్, మెడిసిన్, పీజీ, డిగ్రీ కోర్సులు చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు ఇస్తున్న మాదిరిగా బీసీ, ఈబీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులు మంజూరు చేయాలని జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆర్.కృష్ణయ్య ఆదివారం వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు రూ.1500ల నుంచి రూ.3 వేల వరకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా కళాశాల హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో నీల వెంకటేశ్, సుధాకర్, వేముల రామకృష్ణ, కోట్ల శ్రీనివాస్, రాజ్ కుమార్, రాజేందర్, లింగయ్య, కృష్ణ ఉన్నారు.

అంబేద్కర్ విదేశీ విద్య పథకానికి..

86 మంది ఎంపిక

మేడ్చల్, జనవరి 14(నమస్తే తెలంగాణ): అంబేద్కర్ విదేశీ విద్య పథకానికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి 86 మంది విద్యార్థులు ఎంపిక య్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత అంబేద్కర్ విదేశీ విద్య పథకానికి ఎంపికైన విద్యార్థికి చదువు ఖర్చయ్యే ఫీజులను రూ.20 లక్షలను వివిధ దేశాలలోని యూనివర్సిటీలకు చెల్లిస్తుంది. ఈ వార్షిక సంవత్సరంలో 86 విద్యార్థులు ఎంపిక కాగా, అప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. కోట్ల నిధులను మంజూరు చేసింది. దీంతో 86 ఎస్సీ విద్యార్థులు జిల్లా నుంచి విదేశాలకు వెళ్లనున్నారు. ఎంపికైన విద్యార్థులు విదేశాలలో చేరిన యూనివర్సిటీల నుంచి ఆన్‌లైన్‌లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా షెడ్యూలు కులాల అభివృద్ధి కార్యాలయానికి లేఖలు వచ్చిన వెంటనే ఆయా యూనివర్సిటీలకు నిధులను చెల్లించనున్నట్లు అధికారులు తెలిపారు.

జిల్లా నుంచి ఇప్పటి వరకు...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి ఇప్పటి వరకు 320 విద్యార్థులు విదేశీ విద్య పథకానికి ఎంపికై విదేశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి విద్యార్థికి రూ.20 లక్షలను అందించడంతో ఎస్సీ విద్యార్థులకు వరంగా మారి విదేశాలలో చదువు పూర్తి చేసి అక్కడే ఉద్యోగాలు చేసుకుంటూ అనేక మంది స్థిరపడినట్లు అధికారులు పేర్కొన్నారు.

కిటకిటలాడిన నుమాయిష్

ప్రదర్శనకు సందర్శకుల తాకిడి

అబిడ్స్, జనవరి 14: వరుసగా సంక్రాంతి సెలవులు రావడంతో నాంపల్లిలోని అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన సందర్శకులతో కిటకిటలాడుతోంది. నగర నలు మూలల నుంచి వేలాది మంది సందర్శకులు తరలి వచ్చారు. శని, ఆదివారాలు భారీగా సందర్శకులు నుమాయిష్ సందర్శనకు తరలి రావడంతో మైదానం కిటకిటలాడింది. శనివారం నాటికి మూడు లక్షల పై చిలుకు సందర్శకులు నుమాయిష్‌ను సందర్శించగా, ఆదివారం కూడా దాదాపు ఎనభై వేల పై చిలుకు సందర్శకులు ఎగ్జిబిషన్‌లో సందడి చేశారు. ఈ నేపథ్యంలో స్టాళ్లలో భారీగా అమ్మకాలు చోటు చేసుకున్నాయి. ప్రదర్శనకు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు వనం సత్యేందర్, కార్యదర్శి బి.హనుమంతరావు, సంయుక్త కార్యదర్శి చరణ్‌జిత్ సింగ్, కోశాధికారి ఏనుగుల రాజేందర్ కుమార్‌లు, సొసైటీ సభ్యులు సుఖేష్‌రెడ్డి, జీవీ రంగారెడ్డిలు మైదానంలో తిరిగి పర్యవేక్షించారు. సందర్శకులకు కనువిందు చేసేందుకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.